



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జెసి నవ్య

ఊళ్లు ఖాళీ అవుతున్నా కనికరం లేదా

• వలసలను నివారించి ఉపాధి కల్పించాలి • విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

జిల్లాలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు, నందవరం, ఆదోని మండలాల్లోని గ్రామాల ప్రజలు ఊర్లకు ఊర్లు ఖాళీ చేసి కన్న బిడ్డలను చదువు మాన్పించి వలసలు వెళుతున్నా.. పాలకపక్షాలకు, అధికారులకు ఎలాంటి కనికరం లేదని సిపిఎం జిల్లా నాయకులు విమర్శించారు. వలసల నివారణ కోసం గ్రామాలలో పనులు కల్పించి, విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, ఎండి. ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి 9:30 నుండి అర్ధరాత్రి వరకు ఎమ్మిగనూరు, కర్నూలు మీదుగా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఐచర్ వాహనాల నిండా బతకడం కోసం వెళ్తున్న ప్రజలను ఆపి వలసలకు గల కారణాలను, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సిపిఎం నాయకులు అడిగి తెలుసుకున్నారు. వలసలు వెళ్లే వారు మాట్లాడుతూ ఒక ఐచర్ వాహనం లో 10 కుటుంబాలు, తల్లి పిల్ల అంతా తమ సామాన్లను మీదేసుకొని చలికి వణుకుతూ, ఒకరిపై ఒకరు కుక్కుకొని కూర్చుంటూ బతకడం కోసం పోవడం చాలా బాధాకరమన్నారు. ఇక్కడే ఉంటే ఇంట్లో ఒకరికి పని ఉంటే మరొకరికి పని లేదని, పని పెట్టినా చేసిన పనికి కూలి సరిగా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇచ్చే కూలీ సైతం రూ.130 నుండి రూ.150 వరకు పడడం వల్ల, కుటుంబాలను పోషించుకోలేకపోతున్నా మని వారు తమ దృష్టికి తెచ్చినట్లు నాయకులు వివరించారు. కనీసం రోజుకు రూ.400 కూలి ఇచ్చినా ఉన్న ఊరిని వదిలిపెట్టి, పిల్లల చదువులను మాన్పించి ఎక్కడో బతకడానికి వెళ్లే అవసరం లేదని వలస వెళుతున్న కుటుంబాలు ఆవేదన చెందాయన్నారు. 6, 7 తరగతుల పిల్లలే కాదు భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిసినా పదవ తరగతి పిల్లలను సైతం వలసకు తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామాలలో పనులు కల్పించి, రోజువారి కూలీ రూ.400 ఇవ్వాలన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే వలస వెళ్లిన విద్యార్థులను సైతం అధికారులే దగ్గరుండి తిరిగి తీసుకుని రావాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం బృందంలో జిల్లా కమిటీ సభ్యులు గురు శేఖర్, నాయకులు రంగప్ప, కరుణాకర్, అమర్ పాల్గొన్నారు.



వలస వెళ్తున్న వారితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వలసలు నివారించే సీజనల్ హాస్టళ్లు అవసరం

- కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా పశ్చిమ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులంతా వారి,వారి తల్లిదండ్రులతో వలసలకు వెళ్లకుండా సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ విద్యార్థులు చదువులను మధ్యలోనే వదిలేసి తల్లిదండ్రులతో కలసి వలసలకు పోతున్నారన్నారు. కూలీల వలసలను నివారించటంలో అధికారులు విఫలం చెందారని అన్నారు. కోసిగి, పెద్ద కడుబూరు, మంత్రాలయం మండలాలలోని చిన్నబుంపల్లి, కందుకూరు, దుద్ది, దొడ్డిగెలగల్, జంపాపురం, కడదొడ్డి నుండి ఇతర ప్రాంతాలకు తల్లిదండ్రులతో కలిసి వలసలు వెళుతున్న విద్యార్థులతో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఎమ్మిగనూరులోని పెట్రోల్ బంక్‌లో ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో వలసలు వెళుతున్న వారితో మాట్లాడామన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులను అడిగితే గ్రామాలలో హాస్టళ్లు లేకపోవడం వల్ల పిల్లలకు ఇంటిదగ్గర అన్నం పెట్టడానికి లేకపోవడంతో తీసుకెళ్తున్నామని చెప్పారన్నారు. కొంతమంది పిల్లలు తమ కుటుంబ పరిస్థితులు బాగా లేకపోవడంతో వలసలకు వెళ్తున్నామని అన్నారు. ఇందులో ఎక్కువ శాతం మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉన్నారన్నారు. ఒక వైపు అధికారులు సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తున్నామని, పేపర్లకు ఫోజులు ఇస్తున్నారు తప్ప కింది స్థాయిలో విద్యార్థులు వలసలకు వెళ్ళకుండా చర్యలు తీసుకోవటంలో అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే వలసలు వెళ్తున్న విద్యార్థులకు తిరిగి పాఠశాలల్లో చేర్పించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలలో సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఇక్కడ అవసరమైతే అక్కడ సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయండని, అదేవిధంగా విద్యాశాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులను చైతన్య పరచాలని సూచించారు. ఎస్‌ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, గర్ల్స్ కన్వీనర్ సంయుక్త, ఎస్‌ఎఫ్ఐ నగర నాయకులు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

అర్జీల పరిష్కారం పట్ల అలసత్వం తగదు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజాసమస్యల పరిష్కారవేదిక అర్జీల పరిష్కారం పట్ల అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. అర్జీలను నాణ్యంగా పరిష్కరిస్తున్నారా లేదా ఆయా శాఖల అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆడిట్ నిర్వహించడంలో వెనుకబడి ఉన్నారని, వంద శాతం ఆడిట్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పిజిఆర్‌ఎ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు ఎటు టు వ్యూ ఆప్షన్‌లో అర్జీలు పెండింగ్ ఉండకూడదని, వచ్చిన అర్జీలను గడువు లోపు పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎంఒ ఫిర్యాదుల కు సంబంధించి పెండింగ్‌లో ఉండకూడదని, వేగవంతంగా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఒలను ఆదేశించారు. పుచ్చకాయలమాడ గ్రామ సభలో వచ్చిన అర్జీల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు వాణి డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిట ముద్రించిన రైతు వాణి డైరీ, క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి సోమవారం ఆవిష్కరించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. నకిలీ విత్తనాల సమస్య మార్కెట్ ధరల సమస్య సాగునీటి ప్రాజెక్టుల సమస్య భూములు కోల్పోయిన రైతుల సమస్య కరువు సమస్య అనేక సమస్యలపై పోరాటం నిర్వహించామన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు గొందిపర్ల మాజీ సర్పంచి జి.ఆంజనేయులు, కల్లూరు మండలం రైతు సంఘం నాయకులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



రైతువాణి క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జెసి నవ్య, నాయకులు

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఒప్పంద సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్, పెస్ట్‌కంట్రోల్ కార్మికుల కు కనీస వేతనాలు చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ మునెప్ప, రాష్ట్ర కార్యదర్శి జి.ప్రణీత్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపిఎపి మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎఐటియుసి నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ పురుగుల మందుచల్లే ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులకు మూడు నెలల నుండి ఐదు నెలల జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నటువంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. పెండింగులో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌పిగా భర్త..బెటాలియన్ కామాండెంట్ గా భార్య

- కర్నూలు ఎస్‌పి గా విక్రాంత్ పాటిల్
- రెండో బెటాలియన్ కామాండెంట్‌గా దీపిక
- కాకినాడ ఎస్‌పిగా బిందు మాధవ్ బదిలీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు జిల్లా నూతన ఎస్‌పిగా విక్రాంత్ పాటిల్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ ఎస్‌పిగా ఉన్న విక్రాంత్ పాటిల్‌ను కర్నూలు ఎస్‌పిగా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన భార్య ఎం.దీపిక ఎపిఎస్‌పి రెండో బెటాలియన్ కామాండెంట్ గా నియమితులయ్యారు. ఎపిఎస్‌పి మూడో బెటాలియన్ కామాండెంట్ గా ఉండగా రెండో బెటాలియన్ కామాండెంట్ గా ఆమెను బదిలీ చేశారు. కర్నూలు ఎస్‌పిగా ఉన్న జి.బిందు మాధవ్‌ను కాకినాడ ఎస్‌పిగా బదిలీ చేశారు. 2012 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన విక్రాంత్ పాటిల్ గతంలో విజయనగరంలో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్), చిత్తూరు జిల్లా, రైల్వేస్ (గుంతకల్) పోలీస్ సూపరింటెండెంట్, విజయవాడ సిటీలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, విజయనగరంలో 5వ బెటాలియన్ ఎపిఎస్‌పి కమాండెంట్, పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా పనిచేశారు. దీపిక గతంలో కర్నూలు జిల్లా ఎఎస్‌పిగా పని చేశారు.



ఎస్‌పి విక్రాంత్ పాటిల్



కమాండెంట్ దీపిక

భూ రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా పర్ల

పనులను ప్రారంభించిన తహశీల్దార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పర్ల గ్రామంలో భూ రీ సర్వే కార్యక్రమాన్ని తహ శీల్దార్ ఆంజనేయులు భూమి పూజ చేసి ప్రారం భించారు. తహ శీల్దార్ మాట్లాడుతూ పర్లలో భూ రీ సర్వే ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని తెలిపారు. గ్రామంలో పూర్తి విస్తీర్ణం 8717-34 ఎకరాలు, ఇందులో ఎండోమెంట్, భూమి 229.10 ఎకరాలు, ఎల్ సి ల్యాండ్ 69.40 ఎకరాలు, పోరంబోకు రస్తా కాలువ చెరువు భూములు 449.20 ఎకరాలు, పట్టా భూమి 7969.64 ఎకరాలు ఉందని తెలిపారు. సర్పంచ్ హనుమక్క, ఎంపిటిసి మేకల శేషన్న, గ్రామ పెద్దలు కె.శేఖర్ రీ సర్వే డిటి జయశ్రీ, మండల సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్‌ఒ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామ సర్వేయర్లు నరసింహులు సాయికిరణ్, మండలంలోని పలు గ్రామాల సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.



పర్లలో రీసర్వే పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

36 గృహాలు ప్రారంభం

- స్పెయిన్ దేశస్తుల ఆర్థిక సాయంతో నిర్మాణం

ప్రజాశక్తి- తుగ్గలి

తుగ్గలి మండలం కెపి గుడిసెలలో స్పెయిన్ దేశస్థుల ఆర్థిక సహాయంతో ఆర్‌డిటి స్వచ్ఛంద సేవా సంస్థ రూ 1,02,60,000 లతో నిర్మించిన 36 గృహాలను సోమవారం స్పెయిన్ దేశస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి రంగమ్మ, సర్పంచి సలహాదారులు వెంకటపతి ల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు స్పెయిన్ దేశస్తులకు, ఆర్‌డిటి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ సరస్వతి, డైరెక్టర్ శీబ, ఏరియా టీమ్ లీడర్ రెహానలు మాట్లాడుతూ కెపి గుడిసెలలో 36 మంది నిరుపేదలకు స్పెయిన్ దేశస్థుల ఆర్థిక సాయంతో పక్క గృహాలు నిర్మించామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి కోసం ఆర్‌డిటిసి స్వచ్ఛంద సేవా సంస్థ అనేక సేవా కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ముఖ్యంగా విద్యా వైద్య కోసం ఆర్‌డిటి స్వచ్ఛంద సేవ సంస్థ కృషి చేస్తుందన్నారు. సర్పంచి సలహాదారుడు వెంకటపతి మాట్లాడుతూ తమ గ్రామంలో పేదల అభివృద్ధికి ఆర్డిటి స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషి మరువరానిదని అన్నారు.

7 స్టార్స్ ఆర్కెస్ట్రా అధినేత ఫయూం మృతి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్



ఫయూం (ఫైల్ ఫొటో)

కర్నూలు నగరంలో 30 ఏళ్ల కిందట మొట్టమొదటి సారిగా రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేసి, హైదరాబాద్, చెన్నయ్‌లకు రికార్డింగ్ కోసం వెళ్ళే వారికి వ్యయ ప్రయాసలను తగ్గించిన ప్రముఖ జాజ్ డ్రమ్మర్ షేక్ ఖాజా ఫయూం(57) ఆదివారం రాత్రి మృతి చెందారు. తీవ్రమైన గుండె పోటు రావడంతో చికిత్స అందేలోపే ఆయన మృతి చెందారు. ఫయూంకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారం కిందటే కుమార్తె వివాహం ఘనంగా జరిపించారు. 30 ఏళ్ల కిందట కర్నూలు నగరంలో సినిమా ఆర్కెస్ట్రాలలో జాజ్ డ్రమ్మర్‌గా అరంగేట్రం చేసి, 7 స్టార్స్ ఆర్కెస్ట్రాను స్థాపించారు. అటు తర్వాత రికార్డింగ్ స్టూడియోను ఏర్పాటు చేసి ఎంతో మంది కళాకారులకు ఉత్తమ, నాణ్యమైన సంగీతాన్ని, రికార్డింగ్‌ను అందించారు. 2016లో కర్నూలు జిల్లా ఎస్పీ ఆకే రవికృష్ణ ఆధ్వర్యంలో నేత్ర దానం పై 'చెయ్ చెయ్ చెయ్... నీ కళ్ళను దానంచెయ్' అనే పాటను రికార్డింగ్, కొరియోగ్రఫీ చేసి అందరినీ మెప్పించారు. ఆ పాట అప్పట్లో వైరల్ అయ్యింది. 2025 జనవరి రెండో వారంలో కోడుమూరు సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో రూపొందించిన 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' అనే వీడియో సాంగ్‌ను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ విడుదల చేశారు. అలాగే జానపద, ఖవాలీ, హిందూ, క్రైస్తవ భక్తి గీతాలను, ఎన్నో షార్ట్‌ఫిల్మ్‌ను ఫయూం చేశారు. కర్నూలు జిల్లా వాసులే కాకుండా కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి రికార్డింగ్ కోసం వచ్చేవారు. ఫయూం మరణ వార్త విని కర్నూలు నగర కళాకారులంతా కన్నీటి పర్యంత మయ్యారు. బెంగుళూరు నుండి వచ్చిన సినీ మ్యూజిక్ డైరెక్టర్ ప్రకాష్ బోరున విలపించారు. భార్యాపిల్లలు, బంధువులు, తోటి కళాకారులు, ఆప్తులు, శ్రేయోభిలషుల మధ్య ఫయూం అంత్యక్రియలు సోమవారం ముగిశాయి.

సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కాలనీల్లో ఏర్పడే చిన్నపాటి సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఎప్పటికప్పుండు పరిష్కారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం వడ్డెగేరి, బుధవారపేట, ఎ.క్యాంపు, జోహరపురం ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, పలు కాలనీల్లో పలు సమస్య ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. కొండారెడ్డి బురుజు వద్ద మ్యాన్‌హోల్‌పై వెంటనే మూత పెట్టించాలని, బుధవారపేట, ఏ.క్యాంపుల్లోని ప్యాకెట్ పార్కుల్లో అభివద్ధి పనులు, జోహరపురం నందు మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఇ మనోహర్ రెడ్డి, ట్రైనీ ఎఇ రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ డిబేట్ లో రిడ్జ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



రిడ్జ్ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న జి. ఆద్యశ్రీ సాయి స్కంద ఇండియన్ డిబేటింగ్ లీగ్ , ఐఐటి చెన్నయ్ ఆరేటరి క్లబ్ వారు సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో అద్భుత ప్రతిభ కనపరచి సెమీఫైనల్స్ కు చేరుకున్నారు. జనవరి 26 రిపబ్లిక్ డే రోజు ఐఐటి చెన్నైలో జరిగే పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ రాజ్ కమల్ తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థినికి పాఠశాల సిఇఒ గోపినాథ్ కొ-సిఇఒ సౌమ్య గోపీనాథ్, డీన్ రాజేంద్రన్ అభినందనలు తెలిపారు.



సిబెళగల్‌లో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

పశు ఆరోగ్య శిబిరాలను సక్రమంగా చేపట్టాలి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో చేపట్టే పశు ఆరోగ్య శిబిరాలను సక్రమంగా నిర్వహించాలని పశు వైద్యులు ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం సిబెళగల్ లోని పశు వైద్యశాల నందు సర్పంచు పాండురంగన్న చేతుల మీదుగా ఈ శిబిరం కార్యక్రమం ఘనంగా ప్రారంభం చేశారు. ఇక్కడే పశువులకు బీమా తప్పనిసరిగా చేసుకోవడం వలన ప్రమాద వషాత్తు నష్టాలను అధిగమించవచ్చని అన్నారు. అలాగే పాడి అభివృద్ధి పై ప్రత్యేక అవగాహన అవసరమని సూచించారు. ప్రభుత్వం నుండి ఉచిత మందులు, సంతానోపత్తి వంటివి అందుకోవచ్చని, పశు గ్రాసం కింద, పాడి సంక్షేమం కింద అనేక పథకాలు లబ్ది పొందచ్చని పేర్కొన్నారు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుగ్గలి


ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్(ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం తరలింపును నిరసిస్తూ తుగ్గలిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులతో సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు సోమవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. కడపలోని ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని విలీనం పేరుతో అమరావతికి తరలించడానికి కుట్రజరుగుతోందన్నారు. 1976లో రాయలసీమ గ్రామీణ బ్యాంక్ పేరుతో గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు చేరవేయడంలో భాగంగా కార్యకలాపాలకు శ్రీకారం చుట్టిందన్నారు. 2006లో రాయలసీమ, అనంత, పినాకిని బ్యాంకులను కలిపి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా మారిందని గుర్తు చేశారు. గ్రేటర్ రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన కడప, కర్నూల్, అనంతపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో 551 శాఖలు, 2850 ఉద్యోగులతో సేవలందిస్తుందని తెలిపారు. రూ.18 వేల కోట్ల టర్నోఅవర్‌తో కూడిన వ్యాపార కార్యకలాపాలను సాగిస్తుందన్నారు. ఈ బ్యాంకులో రూ.25 వేల కోట్ల రుణాలు. రూ.22 వేలకోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. అత్యధికంగా 85 శాతం మేర వ్యవసాయ రుణాలను 7 లక్షల మంది గ్రామీణ రైతులకు అందిస్తుందన్నారు. ఆదాయ రిత్యా పెద్ద బ్యాంకుగా ఎపిజిబి నిలిచిందని, అలాంటి బ్యాంకులను అమరావతికి తరలించడం రైతులను ఇబ్బంది పెట్టడమే అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈశ్వరప్ప, రైతులు ఉప్పర రాముడు, సురేష్ యాదవ్, నగేష్, రాజన్న, రామప్ప, కోదండ లక్ష్మమ్మ, రంగమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.



బాలికలను చదివించాలి

క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయిగోపాల్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



బాలికలను చదివిస్తే కుటుంబ ఆర్థిక పరిస్థితితోపాటు దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని క్లస్టర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. 24న జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ , నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ,నైస్ స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీల గోడ పత్రికలను విసి సాయిగోపాల్ , అకాడమిక్ డీన్ వాయిజ్ మహమ్మద్ ,లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరణ చేశారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికల హక్కులు చట్టాలు అనే అంశంపై ఈ వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు వెంకటరమణ కాలనీ మొదటి లైన్ లోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో 22న సాయంత్రం 5 గంటలలోపు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9396861308 సంప్రదించాలని అన్నారు.

అందుబాటులోకి ఫెర్టిలిటీ కేర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అత్యుత్తమ సంతానోత్పత్తి సంరక్షణ నెట్‌వర్క్ గా గుర్తింపు పొందిన ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ను కర్నూలు నగర వాసులతో పాటు జిల్లా ప్రజలకు తమ అధునాతన సౌకర్యవంతమైన ఫెర్టిలిటీ కేర్ అందుబాటులోకి తెచ్చినట్లు ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి సిబుడి తెలిపారు. కర్నూలులో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రం ప్రారంభించిన అనంతరం డాక్టర్ మాట్లాడుతూ సంతానోత్పత్తి చికిత్సను పునర్నిర్వచించటానికి ఈ కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 20 వేల మందికి విజయవంతంగా గర్భం దాల్చటంలో సహాయ పడిందని గుర్తు చేశారు. అలాంటిది కర్నూలులోని కుటుంబాలకు అందుబాటులోకి రావడం ఇది ఒక వరం అన్నారు. ఫెర్టీ9 ఐవిఎఫ్ కన్సల్టెంట్ డాక్టర్ సుశ్రుత మాట్లాడుతూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి కుటుం బానికి అధునాతన సంతానోత్పత్తి సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యం అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, లోతైన సానుభూతితో కూడిన విధానం ఉపయోగించడం ద్వారా మేము జంటలను ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లేలా చేయడం తల్లిదండ్రులుగా మారాలనే వారి కలను సాకారం చేసుకునేందుకు ఉత్తమ అవకాశాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంతానోత్పత్తి సంరక్షణ కోసం పెరుగుతున్న డిమాండ్ అవసరాలను తీరుస్తూ, ఈ కొత్త సదుపాయం తమ ఇంటికి చేరువలోనే అత్యాధునిక సాంకేతికతలు చికిత్సలను పొందేలా చేస్తుందన్నారు. నైపుణ్యం కలిగిన సంతానోత్పత్తి నిపుణులు సలహాదారుల బృందం మద్దతుతోనే సంపూర్ణమైన వ్యక్తిగతీకరించిన సంరక్షణను అందిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరికీ మాతృత్వ ప్రయాణంలో విజయవంతం కావడానికి అవసరమైన మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు.



కర్నూలులో ఫెర్టిలిటీ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి

ఆటో కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



ఆర్థికసాయం అందజేస్తున్న మహిమూద్

ఓల్డ్ సిటీ జోహరాపురంలో నివాసం ఉంటున్న ఆటో కార్మికుడు కృష్ణ ఆదివారం రాత్రి ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆటో యూనియన్ నాయకులు రామకృష్ణ, గిడ్డయ్య, మద్దిలేటిల సహకారంతో యూనియన్ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి పి. మహముద్ ఆధ్వర్యంలో ఆటో కార్మికుడి కుటుంబ సభ్యులకు రూ. 16వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులో మరణించిన ఆటో కార్మికుడు కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం ద్వారా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, ఉపాధ్యక్షులు దూదేకొండ కుమార్, రామకృష్ణ, గిడ్డయ్య, మధు, మద్దిలేటి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మందు పిచికారితో
మామిడి తోట వాడుముఖం
- ఫర్టిలైజర్ దుకాణదారునిపై చర్యలు తీసుకోవాలి
- ఆందోళన చెందుతున్న రైతు

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని అరికెర గ్రామానికి చెందిన కోనేటి చిన్న ఈరన్నకు చెందిన మామిడి చెట్లపై పురుగు మందు పిచికారి చేయగా మామిడి పూత, ఆకులు వాడుముఖం పట్టింది. సోమవారం మామిడి రైతు కోనేటి చిన్న ఈరన్న, అతని కుమారుడు మహాదేవ మాట్లాడుతూ... సర్వే నెంబరు 136-బి3లో 1.50 ఎకరాల పొలంలో 36 మామిడి చెట్లను సాగు చేసినట్లు తెలిపారు. పూతదశలో ఉన్న మామిడి చెట్లకు మందు పిచికారి చేద్దామని ఆలూరులోని హల్వీ లింగేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో యజమాని గోపాల్ వద్ద గత ఐదురోజుల క్రితం మందు కొనుగోలు చేసి పిచికారి చేసినట్లు తెలిపారు. మరుసటి రోజు పూత, ఆకులు ఎండు ముఖం పట్టాయి. ఈ సంఘటన దుకాణదారుడు గోపాల్‌కు తెలుపగా పంటను సందర్శించి 'చూద్దాం.. చేద్దాం' అంటూ కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. మామిడి పంట సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. డబ్బులకు కక్కుర్తి పడి అమాయక రైతులకు నాణ్యత లేని నకిలీ మందులు ఇచ్చి మామిడి పంట వాడుముఖం పట్టడానికి కారకులైన ఫర్టిలైజర్ దుకాణ దారునిపై చర్యలు తీసుకొని రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.హనుమంతు డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను సమీకరించి వ్యవసాయ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.


వాడుముఖం పట్టిన ఆకు


వాపోతున్న రైతు ఈరన్న

కూలీలకు అందుబాటులో ఉండే
ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి
- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి లింగన్న

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం పెసలబండ గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్‌గా మల్లికార్జున స్వామిని కొనసాగిస్తూ పనులు ప్రారంభించాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి లింగన్న, మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ కూలీలతో కలిసి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూలీలకు అందుబాటులో ఉంటూ మల్లికార్జున స్వామి పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ ఇటీవలే మల్లికార్జున స్వామి పేరు ఫీల్డ్ అసిస్టెంట్‌గా రిజిస్టర్ చేసి, అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారని, రెండు వారాలుగా ఆయనకు డిమాండ్, మస్టర్లు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. దీనికి నిరసనగా గ్రామంలోని ఉపాధి కూలీలు స్వచ్ఛందంగా ఎఫ్ఎగా మల్లికార్జున స్వామిని కొనసాగించాలని, ఆయన ఆధ్వర్యంలో పనులు కల్పించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలు ఆంజనేయ, నాగప్ప, బాష, లింగన్న, మహాదేవమ్మ, ఈరమ్మ, గిడ్డయ్య, కూలీలు పాల్గొన్నారు.


నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

'రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలి'

ప్రజాశక్తి -ఆలూరు

మండలంలోని పెద్దహోతూరు గ్రామానికి రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు కోరారు. సోమవారం తహశీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో సచివాలయం సర్వేయర్ గత 8 నెలలుగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పొలం సమస్యలు, గ్రామంలో ఇంటి నిర్మాణం చేసుకోవడానికి పొజిషన్ సర్టిఫికెట్ కోసం తహశీల్దార్ కార్యాలయంలో వినతి అందిస్తే గృహ సంబంధించి కొలతలు స్కెచ్ కావాలని అడుగుతున్నారని చెప్పారు. గ్రామ సర్వేయర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని కోరారు. సిపిఎం మండల నాయకులు కృష్ణ, నాగరాజు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గిరి మూర్తి, నాయకులు బసవరాజు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మతతత్వ భావజాలంపై పోరాటం
- సిపిఎం అభినందన సభలో జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మతతత్వ భావజాలంపై పోరాటాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కోరారు. సోమవారం సిపిఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేసిన సందర్భంగా ఎమ్మిగనూరులోని పద్మశాలి కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి పి.గోవిందు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, ఎమ్‌డి.ఆనంద్ బాబు, బి.రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు సి.గురు శేఖర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజలను పక్కదోవ పట్టించే ప్రకటనలతో కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. మతతత్వ భావజాలంపై పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించాలని, లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేసిన ఎమ్మిగనూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మహాసభ జయప్రదానికి మద్దతునిచ్చిన వర్గం కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పశ్చిమ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. రాబోయే కాలంలో రైతాంగ పోరాటానికి పార్టీ సిద్ధం కావాలని తెలిపారు. ఈ ప్రాంతంలో సామాజికంగా కుల వివక్షను విడనాడే సమస్య పరిష్కారానికి కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బి.రాముడు, కె.కృష్ణ, ఎ.సురేష్, యు.లక్ష్మీనరసయ్య, యు.రమేష్, సిపిఎం కార్యకర్తలు ఖాజా, అబ్బాస్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, ఐద్వా నాయకులు తిమ్మప్ప, గ్రామిక మహిళా సంఘం నాయకులు గోవర్ధనమ్మ, శివలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : కూటమి

ప్రజాశక్తి - కౌతాళం

వ్యవసాయ రంగానికి చేదోడు వాదుడుగా నిలుస్తున్న పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కూటమి నాయకులు వెంకటపతి రాజు, సతీష్ నాయుడు, కాశీ విశ్వనాథ్, రామాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక పశువుల ఆస్పత్రిలో పశువైద్యాధికారి జగదీష్ బాబు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. రైతుల కోసమే ప్రభుత్వం ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ పశువులు ఆరోగ్యంగా ఉండేటట్లు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి వైద్య శిబిరాలతో పాటు పాడి రైతుల కోసం గోకులం షెడ్లను మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. రామలింగ, సుబ్రహ్మణ్యం రాజు, రాజానంద్, సిద్ధు, కృష్ణ, రాజబాబు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న నాయకులు

మందుబాబుల ఆగడాలను అరికట్టాలి : ఆవాజ్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో ఉన్న మైనార్టీ కాలనీలో రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవాజ్ పట్టణ కార్యదర్శి మహ్మద్ ఇక్బాల్ తెలిపారు. సోమవారం సమస్యలపై ఆవాజ్ కమిటీ తరపున సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు, టౌన్ సిఐ శ్రీరామ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లయినా ఇప్పటికీ కాలనీకి ప్రధాన రహదారి లేదన్నారు. కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేదని, కాలనీలో లింకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్నాయని, ముళ్లకంప పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ స్తంభాలను సరి చేయాలని మూడు నెలలుగా వినతిపత్రం ఇస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. మైనార్టీ కాలనీ పరిసర ప్రాంతాల్లో, రస్తాల్లో తాగుబోతులు గుంపులుగా బహిరంగ ప్రదేశంలో తాగి వీరంగం సృష్టిస్తున్నారన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు అటు వైపు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారని తెలిపారు. పోలీసులు దృష్టి సారించాలని కోరారు. సీనియర్ నాయకులు అజీమ్ ఖాన్ ఉన్నారు.


సమస్య చూపుతున్న మహ్మద్ ఇక్బాల్

జిడిపి సాగు, తాగునీటి ఇబ్బందుల నివారణకు కృషి
- ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు మల్లికార్జున గౌడ్

ప్రజాశక్తి- గోనెగండ్ల

గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా కృషి చేస్తానని గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ నూతన అధ్యక్షులు మల్లికార్జున గౌడ్ తెలిపారు. మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు డిఇ కార్యాలయం వద్ద కమిటీ నూతన అధ్యక్షులుగా మల్లికార్జున గౌడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు పంటలకు నీరు విడుదల చేసినందున రానున్న రోజుల్లో నీరు తగ్గి తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా తగిన మోతాదులో నీటి వాటాను ప్రాజెక్టులోకి విడుదల చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు డిఇ విజయకుమార్, ఎఇలు అలీ, శంకర్, నారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉగ్ర నరసింహ, సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కైరవాడి నరసప్ప, తిప్పనూరు కౌలుట్ల, లింగందిన్నె రంగన్న, ఒంటెడుదిన్నె బడేసాబ్, టిబిపి ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు అచ్చుగట్ల హుస్సేన్, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిమ్మారెడ్డి, మదీనా, గౌవుండా రహమతుల్లా, కొత్తింటి ఫక్రుద్దీన్, లింగందిన్నె నాయుడు, గాజులదిన్నె ప్రభాకర్, చంద్రన్న పాల్గొన్నారు.


అభినందనలు తెలుపుతున్న అధికారులు

టిడిపి ఇన్‌ఛార్జీని అధికారికంగా ప్రకటించాలి
- వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ


టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించాలని వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు వైకుంఠం శివప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేవనకొండ మండల టిడిపికి కంచుకోట అని, కొందరు టిడిపి నాయకులు గ్రూపు విభేదాలు సృష్టించి మరో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించేందుకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ టిడిపిలోని నాయకులందరినీ కలుపుకుని పోవడం లేదని, టిడిపి కార్యక్రమాలకు ఎలాంటి సమాచారమూ ఇవ్వడం లేదని తెలిపారు. మండలంలో గ్రూపు విభేదాలు ఏర్పడ్డాయని, టిడిపి అధిష్టానం, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఇన్‌ఛార్జీపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. వైకుంఠం శివప్రసాద్ మాట్లాడుతూ... మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు త్వరలో మంచి రోజులు రానున్నాయని తెలిపారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రూపు విభేదాలు లేకుండా అందరూ ఐకమత్యంగా ఉండాలని, అప్పుడే టిడిపి బలోపేతంగా ఉంటుందని చెప్పారు. కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు మండలంలో తగిన ప్రాధాన్యత ఉండేలా ముందుకు వెళ్తామన్నారు. టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, మల్లయ్య, రాజశేఖర్ గౌడ్, పురుషోత్తం గౌడ్, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

అంగన్వాడీల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆస్పరి





ఆస్పరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆస్పరి, దేవనకొండ మండలాల్లోని 9 అంగన్వాడీ ఆయాల నియామకానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ మద్దమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆస్పరి మండలంలో ముత్తుకూరు-2 (ఓసీ), బిల్లేకల్లు-2 (ఎస్సీ), నగరూరు-2 (బీసీ'ఎ'), యాటకల్లు (ఓసీ), జోహారపురం-4 (ఎస్సీ), హాలిగేర-2 (ఎస్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేవనకొండ మండలంలోని మాచాపురం (ఓసీ), కె.వెంకటాపురం (ఓసీ), నల్ల చెలిమిల-2 (ఓసీ), అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి తప్పనిసరిగా 7వ తరగతి ఉత్తీర్ణలై ఉండాలన్నారు. వయస్సు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని, వివాహితురాలై, స్థానిక నివాసితురాలై ఉండాలని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, 7వ తరగతి, 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, వితంతువు అయితే భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వికలాంగులైతే సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను ఆస్పరి సిడిపిఒ కార్యాలయంలో ఈనెల 28 సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు శివ లింగమ్మ, పద్మ, సునీత, సాహెన బేగం పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. ఆమె చిప్పగిరిలో మాట్లాడారు. గుమ్మనూరు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు ఓసీ మహిళకు అర్హత ఉందన్నారు. కుందనగుర్తి అంగన్వాడీ-1లో ఆయా పోస్టుకు ఓసీ మహిళ, రామదుర్గం-2లో ఆయా పోస్టుకు ఎస్టీ, చిప్పగిరి-2లో బీసీ 'డి' మహిళకు అవకాశం ఉందన్నారు. కార్యకర్త పోస్టుకు పదో తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉండాలని తెలిపారు. ఈనెల 28లోపు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు ఆలూరు ఐసిడిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. **ఆలూరు** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆలూరు, చిప్పగిరి, హోళగుంద మండలాల్లో అంగన్వాడీల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ కెవి.బాలమణి తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తల ఖాళీల సంఖ్య 4, ఆయాలు 8 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆలూరు మండలంలో అంగన్వాడీ కార్యకర్తగా ముద్దనగేరిలో బీసీ 'ఎ', ఆయాగా అరికెర-3లో ఓసీ, హోళగుంద మండలంలో కార్యకర్తలుగా బిజి.హళ్లిలో బీసీ 'ఈ', మూగమాన్ గుందిలో బీసీ 'డి', ఆయాలుగా గజ్జెహళ్లి-1లో బీసీ 'డి', కోగిలతోట-2లో ఎస్సీ, హెబ్బటం-2లో ఎస్టీ, నెరణికి-2లో ఈడబ్ల్యుఎస్ ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

డీఎస్పీగా మర్రిపాటి హేమలత

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డీఎస్పీగా మర్రిపాటి హేమలత బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి విలేకరులతో మాట్లాడారు. మదనపల్లికి చెందిన హరికృష్ణ, లక్ష్మి మొదటి కుమార్తెను అని తెలిపారు. బిటెక్ తర్వాత బెంగళూరులో మూడేళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి, 2022 గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యి మొదటి పోస్టింగ్‌లోనే డీఎస్పీ ఇక్కడ బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు పోలీసులు ఆమెకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

'ప్రకృతి' కూరగాయలతో ఆరోగ్యం పదిలం
- ఐసిఆర్‌పిఎస్ నరసింహులు, వీరేష్

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను తినడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఐసిఆర్‌పిఎస్ నరసింహులు, వీరేష్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలను, ఆకుకూరల అమ్మకాలను సోమవారం ఆస్పరి తహశీల్దార్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో రసాయన మందులు పిచికారీ చేసిన కూరగాయలు వినియోగించడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. అలాగే రసాయన వ్యవసాయం వల్ల వాతావరణం, నేల కాలుష్యం అవుతుందని సూచించారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించాలని తెలిపారు. లక్ష్మీకాంత్, భూలక్ష్మి, జగదంబుడు పాల్గొన్నారు.

'కళాశాల ఘటనపై విచారణ చేపట్టాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ బాలికల కళాశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలిక కళాశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, తరగతి గదిలో పాఠాలు బోధించకుండా అమ్మాయిల వ్యక్తిగత విషయాలు చర్చిస్తూ.. కాలక్షేపం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ వ్యక్తి వ్యవహారం పట్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లెక్చరర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. లెక్చరర్‌తో ఇబ్బంది ఉందని విద్యార్థులే ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, నాగరాజు, చిరు, రాజు, మహేష్, సామాజిక కార్యకర్త తస్లీమా ఉన్నారు.

రాష్ట్ర జట్టుకు ఆదోని క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఆదోనికి చెందిన క్రీడాకారులు ఎంపిక కావడం హర్షణీయమని ఫిలిప్స్ కబడ్డీ జట్టు కెప్టెన్, కోచ్ అమర్ ప్రకాష్ తెలిపారు. సోమవారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 19న కర్నూలు స్టేడియంలో మహిళ, పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పురుషులు 40 మంది పాల్గొనగా 12 మంది ఎంపికయ్యారన్నారు. మహిళలు 20 మంది పాల్గొనగా 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాల 71వ రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, పురుషులు కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదోని నుంచి ఎస్.అవినాష్ (అరుణ్ జ్యోతి నగర్), కె.సుమంగళ (హనుమాన్ నగర్), కస్తూరిబా గాంధీ స్కూల్ బి.సంధ్య (టిజిఎల్ కాలనీ) ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 25 నుంచి 27 వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం అంకుపాలెం లో జరిగే కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు సహకరించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.సుభకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రజకులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- రజక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈరన్న

ప్రజాశక్తి - ఆస్పరి

రజకులు ఆర్థికంగా ఎదగాలంటే రాజకీయంగా అవకాశాలు కల్పించాలని రజక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈరన్న కోరారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రజక వృత్తిదారులపై దాడులు, సామాజిక అత్యాచారాలు ఎక్కువవుతున్నాయని, వాటిని అరికట్టడానికి ఎస్టీ, ఎస్సీ తరహాలో చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ కౌసల్య యోజన కింద అర్హులైన ప్రతి రజక వృత్తిదారులకు పనిముట్లు అందించాలని కోరారు. రజక సంఘం నాయకులు లక్ష్మన్న, గాది లింగ, శేఖర్, కేశవ్, రాజు, కౌలుట్లయ్య, వెంకటేశులు, మహేంద్ర, హనుమంతు పాల్గొన్నారు.


రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం
- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేతో రైతులకు సంబంధించిన భూసమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం మండలంలోని బంటనహాల్ గ్రామంలో భూరీసర్వేను బంటనహాల్ రెవెన్యూ కార్యదర్శి మీనా ఆధ్వర్యంలో ఇజాజ్ అహ్మద్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచి సుశీలమ్మ, టిడిపి నాయకులు సురేష్, గోపాల్, మండల సర్వేయర్ నారాయణ, రెవెన్యూ కార్యదర్శులు గోవిందప్ప, వన్నూరు, పెద్దన్న, ఆంజనేయులు, విలేజ్ సర్వేయర్లు హనుమ నాయక్, అశ్విని, గోవర్ధన, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నందవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేతో రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతాయని డిప్యూటీ తహశీల్దార్ మహేష్ తెలిపారు. మండలంలోని కైరవాడి గ్రామంలో రీసర్వేను ఆయన ప్రారంభించారు. టిడిపి నాయకులు కైరవాడి వీరేష్, వీరారెడ్డి, డీలర్ బజారి, డిప్యూటీ తహశీల్దార్ భూమిపూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


చిప్పగిరి : భూ రీసర్వేను ప్రారంభిస్తున్న తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్


నందవరం